## అనాథ శిశువులకు అభయం 'ఊయల'



హుజూరాబాద్ ఏరియా దవాఖానలో ఊయల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, తదితరులు

హుజూరాబాద్ టౌన్/జమ్మికుంట, మే 13: అనాథ శిశువులకు ఊయల పథకం (క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్) అభయమిస్తున్నదని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు పేర్కొన్నారు. కలెక్టర్, వైద్యారోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖానతోపాటు జమ్మికుంట పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఊయల పథకాన్ని సూపరింటెండెంట్స్ రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన శిశువును వద్దనుకునేవారు నిర్లక్ష్యంగా రోడ్లపై, చెత్తకుప్పల్లో వదిలేయకూడదని, కాస్త మానవత్వంతో ఆలోచించి ఊయల పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన ఊయలలో వదిలివెళ్లాలన్నారు. పసిబిడ్డలను ప్రభుత్వమే బాధ్యతగా పెంచుతుందని తెలిపారు. శిశువును అప్పగించాలనుకునే వారు 94908 81098 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్, డీడబ్ల్యూ డీవో జిల్లా అధికారి, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని జాతీయ రహదారుల సంస్థకు స్వాధీనం చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మే 13 : జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం ఎదురవుతున్న భూసేకరణ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, కలెక్టర్ పమేలా సత్పతి సంబంధితాధికారులను ఆదేశించారు. భారత జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్టు సంచాలకుడు దుర్గాప్రసాద్, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మహేశ్వర్‌తో తన చాంబర్‌లో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసేకరణలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై చర్చించారు. ఇప్పటికే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి వారు సహకరించేలా చూడాలన్నారు. జాతీయ రహదారికి అవసరమైన భూమి సేకరించడంలో భాగంగా సంబంధిత రైతులకు చెల్లింపులు చేసి వెంటనే భూమిని జాతీయ రహదారుల సంస్థకు స్వాధీనం చేయాలన్నారు. సమావేశంలో ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

సైదాపూర్, మే 13: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మకల్, దుద్దనపల్లి గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులకు ఆమె హాజరయ్యారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు వివిధ సమస్యలపై వచ్చే రైతులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్లు శ్రీనివాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మొహ్మద్ అసీనా, W/o. మొహ్మద్ అజీమ్, R/o. బూర్గుపల్లి గ్రామం, గంగాధర మండలం, కరీంనగర్ జిల్లా గారు పొడిశెట్టి నాగలక్ష్మి W/o. విష్ణు, R/o. బూర్గుపల్లి, గంగాధర మం॥, కరీంనగర్ జిల్లా గారి నుండి బూర్గుపల్లి గ్రామంలోని సర్వే నెం 87/B విస్తీర్ణం 242 చ.గ.లలో నిర్మితమైన ఇల్లు నెం. 3-25/2/3 గల దానిని కొనుగోలు చేయుటకు లోను నిమిత్తము RBL BANK LTD కరీంనగర్ బ్రాంచ్ గారిని సంప్రదించినారు. లోగడ పొడిశెట్టి నాగలక్ష్మి గారు ఇట్టి ఇంటి ప్లాటును సాగి నర్సింగరావు, S/o. కిషన్ రావు, R/o. బూర్గుపల్లి గారి నుండి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 4273/2021 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం. 649/2006 గలది పోయినదని అమ్మకందారు తెలిపినారు. కావున ఇట్టి దస్తావేజుపై లేదా ప్రాపర్టీపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నయెడల వ్రాతపూర్వక ఆధారాలతో (7) రోజులలో క్రింది వారికి తెలుపగలరు. లేని ఎడల ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో RBL BANK LTD కరీంనగర్ బ్రాంచ్‌వారు ప్రొసీడు కాగలరు.

ఇట్లు: సం/- **సాన చంద్రమోహన్**, అడ్వకేట్ TS/138/1995
ఫ్లాట్ నెం. 303, శ్రీ సాయి ఎవెన్యూ, ముకరంపుర, కరీంనగర్. సెల్: 9666077777 / 91414 99999

నమస్తే తెలంగాణ CLASSIFIED

**LONG TERM COACHING**

★ BiPC-NEET & MPC-IIT Longterm Coaching Starts on June 1st, Sri Chaitanya Jr. College, Hyderabad Contact **K. Askoh Reddy, AO-9441884705**
NTK-0000

**CHANGE OF NAME**

I, **Kolluri Vasantha** having Passport No: **V5844545**, wife of Tharala Ganesh residing at H.No 5-11/1, Chelgal, Jagitial, Telangana, I hereby declare that I have changed my surname after marriage and shall henceforth be known as **Tharala Vasantha** for all official and legal purposes. All relevant documents shall reflect this change accordingly.

**పేరు మార్పుబడినది**

నేను కొల్లూరి వసంత, పాస్‌పోర్ట్ నెం: V5844545 కలిగి ఉన్నాను, తెలంగాణలోని చెల్గల్, జగిత్యాల, H.No. 5-11/1లో నివసిస్తున్న తరాల గణేష్ భార్యని, వివాహం తర్వాత నా ఇంటి పేరును మార్చుకున్నానని మరియు ఇకపై అన్ని అధికారిక మరియు చట్టపరమైన ప్రయోజనాల కోసం తరాల వసంత అని పిలువబడతానని ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను. సంబంధిత పత్రాలన్నీ ఈ మార్పును తదనుగుణంగా ప్రతిబింబిస్తాయి.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## మున్నూరుకాపులు రాజకీయ శక్తిగా ఎదగాలి



ముకాస రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్‌ను సన్మానిస్తున్న మండల ముకాస నాయకులు

గంగాధర, మే 13 : రాష్ట్రంలో మున్నూరు కాపులు రాజకీయాలను శాసించే శక్తిగా ఎదగాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. మంగళవారం గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేతో రాష్ట్రంలో 18 శాతంగా, 28 లక్షల జనాభాతో బీసీల్లో మున్నూరుకాపులు మొదటి స్థానంలో ఉన్నట్లు తేలిందన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణనలో మున్నూరు కాపు జనాభాను 13.5 శాతంలో ఐదో స్థానంలో చూపించి అణగదొక్కాలని చూసిందన్నారు. ముకాస రాష్ట్ర ఎన్నికల సమీస్తున్న వేళ, గ్రామస్థాయి నుంచి కమిటీలను వేసి రాష్ట్ర ఎన్నికలకు వెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో మున్నూరుకాపుల బలాన్ని చాటిచెప్పి మున్నూరుకాపు కార్పొరేషన్ సాధిస్తామన్నారు. ఇక్కడ సంఘం సభ్యులు మడ్లపెల్లి శ్రీనివాస్, సత్తు కనకయ్య, పులిచెర్ల లక్ష్మీనర్సయ్య, మడ్లపెల్లి గంగాధర్, పూదరి తిరుపతి, కొప్పుల బుచ్చిరాములు, మాడిశెట్టి జనార్ధన్, సామంతుల శ్రీనివాస్, అమిరిశెట్టి భూంరెడ్డి, చింద రమేశ్, జారతి సత్తయ్య, ఆకుల అంజయ్య, గంట కిషన్, దొడ్ల ఎల్లారెడ్డి, ఆకుల తిరుపతి తదితరులు ఉన్నారు.

## సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



గోదాం వద్ద హమాలీలతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య

తెలంగాణచౌక్, మే 13: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని పద్మనగర్‌లోగల సివిల్ సప్లై గోదాం వద్ద గోదాం హమాలీలతో కలిసి మంగళవారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 29 కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నాయని తెలిపారు. కార్మికులు ఐక్య పోరాటాలతో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు సంపత్, అంజయ్య, శ్రీధర్, రాజయ్య, కనకయ్య పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న మాయబజార్ నాటక ప్రదర్శన



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

కమాన్‌చౌరస్తా, మే 13 : మన సమైక్యత కల్చరల్ అకాడమీ సారథ్యంలో కళాభారతిలో మంగళవారం రాత్రి నిర్వహించిన మాయబజార్ నాటక ప్రదర్శన ఆకట్టుకున్నది. రాష్ట్ర భాషా, సాంస్కృతిక, సంగీత నాటక అకాడమీ, టీవీ, చలనచిత్ర, నాటక రంగ అభివృద్ధి సంస్థల సౌజన్యంతో శ్రీసాయి సంతోషి సురభి నాటక రంగం కళాకారులు అందరినీ ఆకట్టుకునేలా నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఆర్డీవో కె మహేశ్వర్ ప్రారంభించి మాట్లాడారు. నాటక ప్రియులను ఆకట్టుకునేలా ఇలాంటి ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. నాటక రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రొడ్డ యాదగిరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, చిందం శ్రీనివాస్, నెల్లుట రవీందర్ రావు, అగస్టిన్, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులకు 20 నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు

హుజూరాబాద్ టౌన్, మే 13: హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఈ నెల 20 నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, యాజమాన్యాలు తమ వాహనాలను పంపించాలని హుజూరాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కంచి వేణు తెలిపారు. మంగళవారం పట్టణంలోని కేసీ క్యాంపులోని ఎంవీఐ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ వాహనాలను ఫిట్‌నెస్‌కు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరెం సంజీవ రెడ్డి, హుజూరాబాద్ అధ్యక్షుడు వకులాభరణం వెంకటేశ్వర్లు, జమ్మికుంట అధ్యక్షుడు సంపత్ రావు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ముసిపట్ల తిరుపతిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బి.రాజ్ కుమార్, పారెడ్డి రవీందర్ రెడ్డి, దాసరి కోటేశ్వర్, సునీల్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం

హుజూరాబాద్ టౌన్, మే 13: హుజూరాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కొమరవెల్లి హరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మండల యాదగిరి, కోశాధికారిగా ఎన్నికైన చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డిని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల నాయకులు దాట్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ, వాకర్స్ గ్రౌండ్ అభివృద్ధికి నూతన కార్యవర్గం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సిటిజన్ ఫోరం ప్రెసిడెంట్ చందుపట్ల జనార్ధన్, కార్యదర్శి సందేల వెంకన్న, మాజీ వాకర్స్ అధ్యక్షుడు వేముల గోవర్ధన్, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, ఆకుల సదానందం, డాక్టర్ తడికమళ్ల శేఖర్, అబ్దుల్ మతిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాలిసెట్



మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, మే 13: పాలిసెట్-2025 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, మొత్తం 4234 మంది విద్యార్థులకు గానూ 3919 మంది పరీక్షకు హాజరు కాగా, 315 గైర్హాజరయ్యారని తెలిపారు.

## గద్దపాక గ్రామంలో తాటివనం దగ్ధం

శంకరపట్నం, మే 13: మండలంలోని గద్దపాక గ్రామ శివారులో తాటి వనం దగ్ధం అయింది. మంగళవారం రాత్రి గద్దపాక గ్రామ శివారులోని రేణుకా ఎల్లమ్మ గుడి సమీపంలో మంటలు చెలరేగగా పలు తాటిచెట్లకు మంటలు వ్యాపించి కాలిపోయాయి. వేసవి కాలం కావడంతో వేగంగా ఇతర చెట్లకు మంటలు విస్తరించాయి. అయితే ఇది ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా కావాలనే చేశారా అని గీతకార్మికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 13: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున బుధవారం నగరం తో పాటు కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, రఘువేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మల్కాపూర్, లక్ష్మీపూర్, ఉదయం 7.30నుంచి 10గంటల వరకు శివ థియేటర్ ఏరియా, వెంకటేశ్వర టెంపుల్ ప్రాంతం, కెమిస్ట్ భవన్, కేడీఆర్ పార్కు ఏరియా, సాధన స్కూల్, జ్యోతినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తిమ్మాపూర్, మే 13: విద్యుత్ లైన్ బ్రేకర్ల మరమ్మతుల నేపథ్యంలో అలుగునూర్ సబ్ స్టేషన్ పరిధిలోని అలుగునూర్, ఎల్ఎండీకాలనీ, మహాత్మానగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మాదాపూర్‌లో పిడుగుపాటు

గన్నేరువరం, మే 13: మండలంలోని మాదాపూర్ గ్రామంలో పిడుగు పడింది. గ్రామానికి చెందిన జెల్లా పోచమ్మ ఇంటి సమీపంలో గల వేప చెట్టుపై పిడుగు పడగా ఆ సమయంలో చెట్టు సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే మండలంలోని ఖాసీంపేట, పారువెల్ల, గన్నేరువరం గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. తీవ్రమైన గాలులకు వరికుప్పలపై కప్పిన కవర్లు కొట్టుకపోవడంతో వరి ధాన్యం తడిసిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## మహిళ అదృశ్యం



శిరీష

గంగాధర, మే 13: మహిళ అదృశ్యమైన ఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన కనకట్ల శిరీష(26) ఆమె భర్త మహేశ్ మధ్య డబ్బు విషయంలో ఈ నెల 10వ తేదీన చిన్న గొడవ జరిగింది. మరుసటి రోజు ఉదయం 11 గంటల సమయంలో గ్రామంలోని బస్టాండ్ వద్ద శిరీష కనిపించగా ఆమె తండ్రి బాబు, భర్త మహేశ్ ప్రశ్నించగా గంగాధరకు వెళ్లి సామాను తీసుకువస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇండ్లల్లో వెతికినా కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు శిక్షణ ఎస్ఐ స్వాతి తెలిపారు.

## పశువుల రవాణా, వధపై అవగాహన సదస్సు

కరీంనగర్, మే 13 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ పట్టణంలోని పశువుల రవాణా, వధకు సంబంధించిన నియమ నిబంధనలు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఏసీపీ కార్యాలయంలో పశువుల రవాణాదారులు, మాంసం విక్రయదారులతో సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పట్టణ ఏసీపీ హాజరై, పశువులను తరలించేటప్పుడు, వాటిని వధించేటప్పుడు పాటించవలసిన చట్టపరమైన నిబంధనలను వివరించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామితో పాటు కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్లు బిల్ల కోటేశ్వర్, సృజన్ రెడ్డి, పశువుల రవాణాదారులు, మాంసం విక్రయదారులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో అఘోరీ శ్రీనివాస్‌పై కేసు

కొత్తపల్లి, మే 13 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన అఘోరీ ఎల్లారి శ్రీనివాస్‌పై కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 28న లైంగికదాడి కేసు నమోదైంది. అయితే ఈ విషయం గురువారం వివిధ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెలుగులోకి వచ్చింది. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. 2024 నవంబర్ 21న కరీంనగర్ కమిషనరేట్‌లోని కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ యువతికి మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడని, జగిత్యాల జిల్లా కొండగట్టుకు తీసుకొని వెళ్లి ఆమె మెడలో పవిత్ర దారం కట్టాడని కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చింది. బాధితురాలి నుంచి ₹3 లక్షలు తీసుకొని విషయం బయటకు ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని భయభ్రాంతులకు గురిచేసినట్టు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దాంతో అఘోరీ శ్రీనివాస్‌పై లైంగికదాడితో పాటు పలు సెక్షన్లపై కేసు నమోదైంది. శ్రీనివాస్ ఇప్పటికే జైల్లో ఉండడంతో ఆన్‌లైన్‌లో కోర్టుకు హాజరు పరిచినట్టు తెలిసింది.

## 'ఎల్లమ్మ' గుడిలో చోరీ

జమ్మికుంట, మే 13: మడిపల్లి గ్రామ శివారు తాటి వనంలోని ఎల్లమ్మ గుడిలో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి ఎల్లమ్మ గుడి తాళం పగులగొట్టిన దొంగలు, అమ్మవారి మెడలోని పుస్తెల తాడు, మట్టెలు, పడగలు, తదితర బంగారు, వెండి వస్తువులతో పాటు హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. కాగా, చోరీ ఘటనపై గుడికి సంబంధించిన గౌడ సంఘం నాయకులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## 'ఉపాధిహామీ పథకం రద్దుకు కేంద్రం కుట్రలు'

శంకరపట్నం, మే 13: ఎంతో మంది నిరుపేదలకు తిండి పెడుతున్న ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు ఆరోపించారు. మంగళవారం ఆయన ముత్తారం ఉపాధిహామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టాక 2014 నుంచి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పేదలకు నష్టం చేకూర్చే విధానాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కొత్త జీవోలను తెస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే నిధులు తగ్గిస్తున్నారని చెప్పారు. ఉపాధిహామీ రక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చేపట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## గ్రామీణ కార్మికులు సమ్మెలో పాల్గొనాలి

తెలంగాణచౌక్, మే 13: ఈ నెల 2న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో గ్రామీణ ప్రాంత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో మంగళవారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తున్నదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతంలోని పేదలకు ఆర్థిక స్వాలంబన చేకురుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. ప్రతి బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధుల్లో కోత పెడుతున్నదని విమర్శించారు. కార్మికుల హక్కులను హరించేలా చట్టాలను సవరిస్తున్నారని మండిపడ్డారు. దీనికి నిరసనగా దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణకూలీలు పనులకు పోకుండా బంద్ పాటించాలన్నారు. సమావేశంలో నాయకులు బోయిని అశోక్, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

## హోంగార్డుల బదిలీల కోసం దర్బార్

కరీంనగర్, మే 13 (నమస్తే తెలంగాణ): హోంగార్డుల బదిలీల కోసం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం దర్బార్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కరీంనగర్ నుంచి కొత్తగా ఏర్పడిన జిల్లాలకు బదిలీపై వెళ్లిన హోంగార్డులకు 9 సంవత్సరాలుగా బదిలీలు జరుగలేదని తెలిపారు. వారి అభ్యర్థన మేరకు త్వరలో బదిలీలు చేపడతామని హామీ ఇచ్చారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం పోలీస్ కమిషనర్ అధ్యక్షతన ఇద్దరు ఏసీపీలు, ఏవో, ఒక రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌తో కూడిన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కరీంనగర్‌కు 300 మంది హోంగార్డులను కేటాయించారని తెలిపారు. జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, హనుమకొండ, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు బదిలీలు జరుగనున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఏవో ముని రామయ్య, ఏసీపీలు మాధవి, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, సురేశ్‌తో పాటు హోంగార్డులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి కార్పస్ ఫండ్ చెక్కు అందజేత



కార్పస్ ఫండ్ చెక్కును అందిస్తున్న సీపీ

కరీంనగర్, మే 13 (నమస్తే తెలంగాణ): ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ జి. రాజిరెడ్డి కుటుంబానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం కార్పస్ ఫండ్ చెక్కును అందజేశారు. రామడుగు మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన రాజిరెడ్డి కరీంనగర్ కమిషనరేట్‌లోని ట్రాన్స్ పోర్ట్ విభాగంలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ డిసెంబర్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, రాజిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజిరెడ్డి భార్య వజ్రమ్మకు కమిషనర్ స్వయంగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బి సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, బి సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

కొత్తపల్లి, మే 13: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కొత్తపల్లి ఎస్ఐ ఎస్ సాంబమూర్తితో కలిసి ఇసుక అక్రమ రవాణా-చట్టపరమైన చర్యలు అంశంపై ఎలగందల్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణా ద్వారా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, భవిష్యత్తు తరాలకు తాగునీరు లభించని దుస్థితి ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు గతంలో కేసులు నమోదైన యజమానులు పాల్గొన్నారు.

## మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రం పరిశీలన

కార్పొరేషన్, మే 13: బొమ్మకల్ సమీపంలోని నగరపాలక సంస్థ మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని మంగళవారం కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్లాంట్‌లో ఫిల్టర్లు, స్లడ్ హ్యాండర్లు, తదితర వాటి పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్ ఆధునీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను నూతన టెక్నాలజీతో ఆధునీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, కుక్కల బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గతంలోనే నగరపాలక సంస్థకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి.. అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సంజీవ్ కుమార్, డీఈ అయూబ్ ఖాన్, ఏఈ గఫూర్, వెటర్నరీ అధికారి, తదితరులు పాల్గొన్నారు.


## సెలవులో డిప్యూటీ కమిషనర్

కార్పొరేషన్, మే 13: కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి నెల రోజుల పాటు సెలవులో వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లగా ఆమె బాధ్యతలను డిప్యూటీ కమిషనర్ ఖాదర్‌కు అప్పగించారు.

## గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు

హుజూరాబాద్ టౌన్, మే 13: గంజాయి సేవించినా, విక్రయాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ హెచ్చరించారు. గంజాయి మత్తుకు బానిసలైన ఐదుగురు యువకులకు మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా గంజాయికి అలవాటు పడినా, అమ్ముతున్నట్లు తెలిసినా వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎబాన్ డ్రగ్ యూరిన్ టెస్టింగ్ కిట్ ద్వారా నెల నుంచి ఆరు నెలల వ్యవధిలో 12 రకాల మత్తు పదార్థాలు, గంజాయి సేవించిన వారిని గుర్తించవచ్చని తెలిపారు. గంజాయి మత్తుకు బానిసలైన సదరు యువకులను పట్టుకునేందుకు కృషి చేసిన హుజూరాబాద్ సీఐ కరుణాకర్, ఎస్ఐ జి. నరేందర్ రెడ్డిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## జానపద ప్రజాకళారూపాలను పరిరక్షించుకుందాం



కర పత్రం ఆవిష్కరిస్తున్న నలిమెల భాస్కర్, నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, మే 13 : ఒక తరం నుంచి మరో తరానికి సంస్కృతీ సంప్రదాయాలు, మానవ నాగరికత మూలాలను చేరవేయడానికి వారధిగా నిలుస్తున్న గ్రామీణ జానపద ప్రజాకళారూపాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ పేర్కొన్నారు. మానకొండూర్ మండలం, మద్దికుంట గ్రామంలో శ్రీ శివమారుతి భజన మండలి ఆధ్వర్యంలో జరిగే చిరుతల రామాయణ నాటక ప్రదర్శన కరపత్రాన్ని ఆయన మంగళవారం కరీంనగర్‌లో ఆవిష్కరించారు. నాటక ప్రదర్శనలో భాగంగా 14న భరతుని పాదుకాపట్టాభిషేకం, 15న సుగ్రీవ పట్టాభిషేకం, 16న విభీషణ పట్టాభిషేకం, 17న శ్రీసీతారాముల పట్టాభిషేక ఘట్టం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు రాత్రి 8 నుంచి 2 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కవులు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

## నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు



మధురానగర్‌లోని పాన్‌షాప్‌లో నార్కొటిక్ డాగ్‌తో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

గంగాధర, మే 13 : శిక్షణ ఎస్ఐ స్వాతి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మధురానగర్ చౌరస్తాలో గంజాయి అమ్మకాలపై నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలోని నాలుగు రోడ్లలో ఉన్న వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో, యువత ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు జరిపారు. గంజాయి విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్థానిక దుకాణాదారులను హెచ్చరించారు. కాగా, మధురానగర్ చౌరస్తాలో నార్కొటిక్ డాగ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహించడంతో ఏం జరుగుతుందో తెలియక చౌరస్తా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గంజాయి అమ్మకాలపై తనిఖీలు నిర్వహించినట్లు తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు. ఇక్కడ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.